# ఇరుసు ఇరిగిన బండి

- కొలనుపాక మురళీధరరావు

కోడి కూయగానే మారమ్మ గబగబా లేచి, "అప్పుడే కోడి కూసిందే. రేకలు బారుతున్నాయి" అనుకుంటూ తాటాకు పొరకతో ఇంటిముందు గబగబా వూడ్చి, బోరింగ్ కాడికెళ్లి ప్లాస్టిక్ బకెట్‌తో నీళ్లు నింపేసరికి చేతులు నొప్పి పుట్టినయ్.

"ఏం బోరింగో ఏం పాడో... బతుకమ్మ పండుగ వచ్చే రోజులైన నీళ్లు కరువాయె. వాయుదారి కాలం వచ్చే...'' అంటూ సణుగుతోంది.

"ఎవరినే తిడుతున్నావ్ పొద్దున్నే" అన్నాడు ఆమె భర్త మారయ్య.

"నిన్ను గాదులే. ఎవర్ని తిడితే ఎవరూరుకుంటారు. కనబడని ఆ దేవుణ్ణి తిడుతున్నానులే" అన్నది మారమ్మ.

"నేను అప్పుడే అనుకున్నా, బోరింగ్ కాడికి వెళ్లినప్పుడల్లా విరుచుకు పడ్తావు. అది నీకలవాటైంది" అన్నాడు మారయ్య.

"నిజమే మావా... బకెట్టు నీళ్లు కొట్టుకొచ్చే వరకు పానం పోయిందనుకో. ఎనుకటి చెరువులు, చేదబావులే నయం. బతకటానికి బస్తీకొస్తే ఈ పాట్లన్నీ తప్పవాయె'' అని నసుగుతోంది మారమ్మ.

"ఏందే... పొద్దున్నే నీ సణుగుడు. జల్దీ చాన్పు చల్లి తొందరపడవే. మళ్లీ పొద్దుపోతుంది'' అంటుండగానే దూరంగా పోలీస్ క్వార్టర్స్‌లో ఐదు గంటలు కొట్టిన చప్పుడు వినిపించింది.

తొందర తొందరగా చాన్పు చల్లి ముగ్గు పెట్టి మొగం కడుక్కొని నిన్న రుబ్బిన ఇడ్లీ పిండిలో రవ్వ కలిపి, "మావా... నే బోతున్నా. చట్నీ, ఇస్తరాకులు తీసుకొ్రా" అని చెప్పి దగ్గర్లోనే వున్న తమ్ముని ఇంటికి వెళ్లి ఆడ బండిని కడిగి సామాన్లు సదిరింది మారమ్మ.

"ఏమొదినా అన్న రాలేదా'' అంటూ కరెంటుతో రుబ్బిన ఇంకాస్త ఇడ్లీపిండి ఇచ్చింది మరదలు.

ఇంతలోనే మారయ్య చట్నీ, ఇస్తరాకులు, పేపర్లు తీసుకొని వచ్చి, "పదవే... ఇప్పటికే లేటయింది" అంటూ వెంకటేశ్వర టాకీసు దగ్గరకు పోయింద్రు.

బండితో అక్కడికి వెళ్లిన వెంటనే, "ఏందక్కా... ఇవ్వాళింత లేటయింది" అన్నాడు స్కూటర్ మెకానిక్.

మారయ్య జరిగింది చెప్పాడు.

"సరైన సోదా లేకుంటే ఇంతే అవుతుంది. ఏం చేస్తాం. ఉండన్నా... కొంచెం సాంబారు చేసి ఒక్క వాయి వేడివేడి ఇడ్లీ వేసిస్తాను. జరా ఏమనుకోకు" అన్నది మారమ్మ.

ఎంకన్న ప్రతి దినం ఈడ నాల్గు ఇడ్లీలు తిని, రాజస్థాన్ చాయ్ తాగి తన స్కూటర్ రిపేరింగ్ చేయడం అలవాటు. ఇంతలో వెంకటేశ్వర టాకీసు గేటు కీపరొచ్చి అదో యిదో మాట్లాడి నాలుగు ఇడ్లీలు కట్టించుకున్నాడు.

పదకొండయిందాకా ఏదో ఒక గిరాకీ వస్తుంది. పొద్దు నడినెత్తి మీదికొచ్చేసరికి తట్టాబుట్టా సర్దుకొని మళ్లీ గూటికి చేరుతారు ఆ మొగుడూ పెళ్లాలు.

మళ్లీ స్నానాలు. అన్నం తిని సాయంత్రం నాలుగు గంటలకు మిర్చిబజ్జీలు అమ్ముతూ రెండవ సినిమా ఇంటర్‌వెల్ వరకుండి వాపసు వస్తారు. ఇది వారి జీవన పోరాటం. సాగుతుంది బతుకు బండితో.

రాత్రంతా నిద్దుర పట్టలేదు. కలత నిద్ర. ఏదో బుగులు అవుతోంది మారయ్యకు.

"ఎన్నడూ లేంది ఈ బుగులు ఎందుకు చెప్మా" పక్కమీంచి లేచి కూర్చున్నాడు. ఇంతలో ఎవరో కక్కిన చప్పుడైంది పెరట్లో. వెంటనే అక్కడికి లగెత్తి చూస్తే- ఏముంది... మారమ్మ తలపట్టుకుని కూర్చుంది. ఎద ఎగిసిపడుతోంది. వెంటనే లోపలికి పోయి ఉప్పు మిరపకాయలు, జీడి గింజలు తీసుకువచ్చి ఆమె చుట్టూ తిప్పి చౌరస్తాలో వేసి వచ్చాడు. ఇంకా ఆమె రొప్పుతూనే వుంది.

"నా పెళ్లాం బాగుంటే ముత్యాలమ్మ తల్లీ... నా కోడి చదివిస్తా" ముత్యాలమ్మ గుడివైపు దండం పెట్టుకుంటూ మెల్లగా మారమ్మను లోపలికి

తీసుకొచ్చి పక్కపై పండబెట్టిండు.

దూరంగా నాల్గు గంటలు కొట్టిన చప్పుడైంది. బయట ఎవరో తలుపు కొడుతున్నారు.

''మారక్కా... బావా...'' అంటూ పిలుస్తున్నారు.

"ఆఁ వచ్చే... ఎవరూ..." అంటూ తలుపు తెర్చి, "నీవా బావా... ఇంత పొద్దున్నే. అందరూ బాగున్నారా" ఆదుర్దాగా అడిగాడు మారయ్య బామ్మర్ది నారాయణను చూస్తూ.

''అరె, మారక్కా... ఇదేందే ఇట్టా పడుకున్నావ్" చేయి పట్టుకుని నాడి చూస్తూ అడిగాడు.

నాడి నీరసంగా కొట్టుకొంటోంది.

''ఎవరి దిష్టి తగిలిందో మీ అక్కకు-పొద్దుటినుండి రొప్పుతోంది" దిగులుతో అన్నాడు మారయ్య.

"అల్లం వుందా... అల్లం పసరు తీసి తాపితే కొంచెం నెమ్మళిస్తుంది. ఆ రసం తాగితే వున్న పైత్యం పోతుంది. దిష్టి లేదు, గిష్టి లేదు. పొద్దుటి నుండి మధ్యాహ్నందాకా ఎండలో నిలబడితే పైత్యం రాక ఏం చేస్తుంది. పరగడుపున తినకుండా ఎండలో నిలబడితే కడుపులో దేవినట్లయి వాంతులౌతాయి. యియాల బయటికి పోకు. నాకు తెల్సిన చారి డాక్టరు దగ్గరకు పోదాం. గోలీలు, సూదులు ఇస్తాడు. పానం కుదుటపడుతుంది. బేజారుగాకు. ఫికరు పడితే ఏమొస్తుంది. ఆఁ చెప్పడం మరిచిపోయాను. మీ అల్లుడికి దెబ్బలు తగిలినాయి. రామన్నపేట దవాఖానాలో వేసినారు. నేను నల్గొండకు వస్తుంటే మీకు చెప్పమని మా ఆవిడ చెప్పింది. అందుకే నేను వచ్చిన" అన్నాడు నారాయణ.

"అరె నా బిడ్డో... ఏమైందన్నా, సరిగ్గా చెప్పన్నా... నీ కాళ్లు పట్టుకుంటా. ఇప్పుడెట్లా. నాకేమో ఇట్లయింది. ఏందో అన్ని కష్టాలు ఒకసారే వస్తాయి" అంటూ లబోదిబోమంది మారమ్మ.

''నా బిడ్డ ఎట్టుందో, ఏమో. అమ్మ రాలేదనుకుంటుందో, ఏమో" దిగులుతో అంది మారమ్మ.

"నే చెప్తాలే. మధ్యాహ్నం నేను రామన్నపేటకు పోతా. మళ్లీ నీకు చెప్పంపుతా" అన్నాడు నారాయణ.

ఇంతలో ఐదు గంటలు కొట్టిన చప్పుడైంది.

"నువ్వయిన దైర్యం చెప్పు బావా... అక్క బెంబేలు పడుతుంది" అన్నాడు మారయ్య యాపారానికి సామాను సర్దుకుంటూ.

"నీవేం గాబరాపడకు. అంతా బాగైపోతుంది. నీవు ఇంటికాడనే వుండు. నేను ఒక్కపూట పోయి వస్తా. ఆ తరువాత ఆ కనకదుర్గమ్మ తల్లి దయ..." అంటూ గబగబా ఇడ్లీపిండి, చట్నీ డబ్బా, ఇస్తరాకులు తీసుకుని పోయాడు మారయ్య. నేను కూడా వస్తానని నారాయణ కూడా వెంకటేశ్వర టాకీసు అడ్డ మీదికి వచ్చిండ్రు.

''ఏందయ్యో... ఇంతాలస్యమైంది. ఏందియాల ఉషారు లేవు" అని ప్రశ్నించాడు ఎంకన్న.

"ఎంకన్నా... ఏం చెప్పను. మీ అక్కకు వాంతైంది. మరేమో మా అల్లుడికి దెబ్బలు తగిలి రామన్నపేట దవాఖానాలో ఉన్నాడు. పోదామంటే రెక్కాడితే డొక్కాడని బతుకులాయె. ఏం చేయాలో తోచడం లేదు" బాధతో అన్నాడు మారయ్య.

"అన్నా... ఇదిన్నావా. శ్రీనిధి చిట్టీల కంపెనీ ఉడాయించినాడట. మన చిట్టీలు గోయిందా... యిప్పుడే వార్త పేపర్లో వచ్చింది. పది లక్షలతో టోపి పెట్టిండ్రు" అన్నాడొక వ్యక్తి.

''అయ్యో... నేను ఈ నెలలో చిట్టీ ఎత్తుకుందామనుకున్నాను. నా గతేంకాను..." గొల్లుమన్నది రాములమ్మ.


"ఏందే... నీ ఒక్కదాని సొమ్ము పోయినట్లు యాగి చేస్తున్నావు. మాయి కూడా పోయినవి" అంది సోమక్క.

"అయ్యో దేవుడా... మరి నా సంగతో. మా ఆడదాన్కి ఏం చెప్పాలే. అసలే పానం బాగలేదు" నెత్తీనోరూ కొట్టుకుంటూ బిక్కమొగంతో అన్నాడు మారయ్య.

"అందుకేనేమో, ఇయాల తెల్లారగట్ల నుండి బుగులు బుగులయింది" అన్నాడు మారయ్య.

పదకొండయింది. ఇంక గిరాకీ వచ్చే ఆశ లేదు. అందులో తెచ్చిన పిండి కూడా అయిపోయింది. బావ బామ్మర్దులు ఇంటివైపు మళ్లి కనకదుర్గమ్మ గుడి మూలకు గబగబా నడక సాగుతూనే ఉన్నారు. ఇంకా పది గజాలు నడిస్తే ఇల్లొచ్చే అనుకుంటూ వెళ్తుండగా, ఇంతలోనే కోళ్లు తీసుకెళ్తున్న ఆటో మారయ్య బండిని గుద్దేసింది.

"అయ్యో... నా కాళ్లు... నా చెయ్యి..."



అంటూ మారయ్య కూలబడిపోయిండు.

నారాయణ గోలబెట్టడంతో గుడిలోని జనం ఆటోవాణ్ణి ఆపేసింద్రు. బండి నుగ్గయి పనికిరాకుండయిపోయింది. స్టవ్, సామాన్లు రోడ్డుమీద చెల్లాచెదురై పడ్డాయి.

"ఏంబే... కళ్లు నెత్తిమీద ఉన్నవా. టర్నింగ్‌లో హారన్ కొట్టుకుంటూ మెల్లగా వస్తే నీ అబ్బ సొమ్ము పోయింది. ఈ నా కొడుకులు ఎప్పుడు ఎవరి పానాలు తీస్తారో..." అంటూ జనం ఆటోడ్రైవర్‌పై విరుచుకుపడ్డారు.

"ఓ మారక్కా... మారయ్యకు దెబ్బలు తగిలాయి. ఆటో మీ ఇడ్లీ బండిని గుద్దింది" ఎవరో గుంపులో నుండి కేక వేసేసరికి- మూలుగుతూ, ముక్కుతూ పడుకున్న మారమ్మ ఏమైందోనని ఏడ్చుకుంటూ, నెత్తికొట్టుకుంటూ బండికాడికొచ్చింది.

అప్పటికే టూటౌన్ పోలీసులొచ్చి ఆటోడ్రైవర్‌ను పట్టుకెళ్లి, దెబ్బలు తగిలిన మారయ్యను, నారాయణను దవాఖానాకు పంపించి పంచనామా చేసేసరికి గంట పట్టింది. చిందరవందరంగా పడిన సామాన్లు సర్దిపెట్టారు. దెబ్బలు తగిలాయి కానీ అంత ప్రమాదకరం కాదని ఆటోడ్రైవర్‌పై కేసు పెట్టారు.

"అంత స్పీడుగా ఆ మూల నుండి రాకపోతే ఏంబాయె. ముదనష్టపు మాంసం కొట్టు చేయబట్టి కోళ్ల లారీలు, ఆటోలు స్పీడుగా పోవటం, ఎవరినో ఒకరిని గుద్దటం వాళ్లకలవాటైంది. ఈ వాడకట్టులో మాంసపు కొట్లు తీయించే వరకు ఇట్లాగే ఆక్సిడెంట్లు జరుగుతాయి" అన్నారెవరో.

"మారమ్మొదినా... నీ నసీబు బాగుంది. మారన్నకు భయమేమి లేదు. కానీ, నీ బండి పనికిరాకుండా పోయింది" అన్నది జనంలో ఒకావిడ.

"అటు అల్లుడు, ఇటు మొగుడు... ఆ ఇద్దరి మధ్య తన కడుపులో నొప్పి. బతుకుబండి మూలకు, ఆ బండిలాగే మేము దవాఖానాపాలు. మరి మా బతుకుబండి సాగేదెప్పుడు? మమ్మల్ని గట్టెక్కించు. కనకదుర్గమ్మ తల్లీ... మేము బాగుపడితే నీకు మంచి చీర కట్టిస్తాన"ని మొక్కుకుంది గుడి ముందు పడిన సామాను ఏరుకుంటూ దిగులుతో మారమ్మ.

ఇరుసు ఇరిగిన బండి. గుండె చెదిరిన బతుకు ఏమవుతుందో అనుకుంటూ ఆ తల్లిముందు సాగిలపడింది.

●